వర్షం దాటికి తేరుకోని కాలనీలు

- పోచంపాడ్‌లో ఇళ్లలోకి చేరిన వరద
- ఇబ్బందుల్లో వడ్డెర కాలనీవాసులు

బాల్కొండ: భారీ వర్షానికి ఎస్సారెస్పీ ప్రాజెక్టు దిగువన ఉన్న మెండోరా మండలం పోచంపాడ్ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో వడ్డెర కాలనీవాసులు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రెండు రోజులుగా ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ద్వారా 5.5 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదలడంతో కాలనీలోకి నీరు వచ్చి చేరుతోంది. దీంతో కాలనీవాసులు ఇళ్లను ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. ప్రాజెక్టు నుంచి 5 లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువ నీటిని ఎప్పుడు గోదావరిలోకి వదిలినా ఇళ్లు ఖాళీ చేయాల్సిందేనని కాలనీవాసులు పేర్కొంటున్నారు. రెండు రోజుల నుంచి కంటి మీద కునుకు లేకుండా కాలం వెళ్లదీస్తున్నామని వాపోతున్నారు. గోదావరిలోకి వరద గేట్లను ఎత్తే సమయంలో సైరాన్ ఇస్తారు. అలా సైరాన్ ఇచ్చిన ప్రతి సారి కాలనీ వాసుల గుండెల్లో రైళ్లు పరిగెడుతాయంటున్నారు. కొంత కాలంగా సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నెహ్రూనగర్‌లో నిర్మించినా..

పోచంపాడ్ జాతీయ రహదారి పక్కన 2007లో 702 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించారు. అందులో వడ్డెర కాలనీ వాసులకు కూడా కేటాయించాలని నిర్ణయించారు. కానీ తర్వాత మాట మార్చి వారికి కేటాయించలేదు. ప్రస్తుతం ఆ కాలనీలో 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. 702 ఇళ్లలో ఇళ్లను ఎందుకు కేటాయించలేదో ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నలాగే మిగిలి పోయింది.



పోచంపాడ్‌లో వడ్డెర కాలనీలో ఇళ్ల మధ్యలోకి వచ్చిన వరద నీరు

కంటి మీద కునుకు లేదు



ప్రాజెక్ట్ నుంచి గోదావరికి నీరు వదిలిన ప్రతి సారి భయం భయంగా ఉంటున్నాం. రెండు రోజులుగా ఎక్కువగా నీరు వదలడంతో ఇళ్లలోకి నీరు వచ్చి చేరింది. దీంతో కంటి మీద నిద్ర లేకుండా ఉంటున్నాం.

– గంగాధర్, కాలనీ వాసి, పోచంపాడ్

ప్రభుత్వం ఆదుకోవాలి



వడ్డెర కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయి. ప్రతి ఏడాది వర్షాకాంలో గోదావరి నీరు ఇళ్లలోకి వస్తోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. పక్కా ఇళ్లు కట్టించి ఆదుకోవాలి.

– వేముల లక్ష్మి, కాలనీ వాసి, పోచంపాడ్

పునరావాస కేంద్రానికి ఇందిరమ్మ కాలనీవాసులు



రెంజల్: మండలంలోని కందకుర్తిలో ఉన్న ఇందిరమ్మ కాలనీలో లోతట్టు ఇళ్ల కుటుంబీకులను శుక్రవారం రాత్రి రైతు వేదికలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి 60 మందిని అధికారులు తరలించారు. ఎస్సై చంద్రమోహన్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో రఫియొద్దీన్, పీఆర్ఏఈ వినయ్ శనివారం తెల్లవారుజాము వరకు బాధితులను తరలించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందిరమ్మ కాలనీలోకి వరద నీరు వచ్చి చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

బాధితులకు అన్నదానం ఏర్పాటు

రెంజల్: మండలంలోని కందకుర్తిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో 60 మంది వరద బాధితులకు కాంగ్రెస్ నాయకులు అన్నదానం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాయకులు సిరాజ్‌బేగ్, పుర్కానొద్దీన్, గయాసొద్దీన్, అవేస్‌ఖాన్ ఉన్నారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

వర్ని(చందూర్): భారీ వరదల వల్ల నీట మునిగిన ఇళ్ల బాధితులకు శనివారం రెవెన్యూ అధికారులు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 192 ఇళ్లు నీట మునిగినట్లుగా గుర్తించిన అధికారులు తక్షణ సహాయం కింద బియ్యం, కందిపప్పు, వంట నూనెను అందించినట్లు తహసిల్దార్ వీర్ సింగ్ తెలిపారు. చందూర్ మాజీ జెడ్పీటీసీ అంబర్ సింగ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయారెడ్డి, సొసైటీ చైర్మన్ అశోక్ పాల్గొన్నారు.

తల్వేద వాగు బ్రిడ్జిపై పారుతున్న వరద

నందిపేట్: మండలంలోని తల్వేద బ్రిడ్జి వద్ద వరద ప్రమాదకరంగా పారుతోంది. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవడంతో శనివారం వరద ఉధృతి తీవ్రస్థాయికి చేరింది. దీంతో తల్వేద–నాళేశ్వర్ గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి పై నుంచి ప్రమాదకరంగా వరద పారుతోంది. ఉదయం నుంచి వరద ఉధృతి పెరగడంతో పోలీసులు బ్రిడ్జి వద్ద రాకపోకలను నిలిపివేశారు.



తల్వేద-నాళేశ్వర్ వాగు బ్రిడ్జిపై నుంచి ప్రమాదకరంగా పారుతున్న వరద

క్లుప్తంగా

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలి

నందిపేట్: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరుతూ శనివారం నందిపేట తహసీల్ కార్యాలయం ఎదుట ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సతీశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.గంగాధర్, రాజలింగం, దశరథ్, దేవన్న, భోజమ్మ, రాజమణి, సాకలి భూదేవి, సాయమ్మ, గుండు కళావతి తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతి తెలుగు భాషలో నిక్షిప్తమై ఉంది

ఆర్మూర్: మన సంస్కృతి, మన గౌరవం తెలుగు భాషలోనే నిక్షిప్తమై ఉందని, దాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రోటరీ అధ్యక్షుడు జక్కుల రాధాకిషన్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రోటరీ భవన్‌లో శనివారం హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడా, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా వ్యాయామ, తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సెక్రెటరీ ఖాందేష్ సత్యం, నరేశ్, చరణ్ రెడ్డి, సురేష్, వన్నెల్ దేవిరాము, శ్రీకాంత్, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలో జలకాలాట



రెంజల్: గోదావరి వరద మండలంలోని కందకుర్తి గ్రామం చుట్టూ చేరింది. గ్రామంలోని స్వయంభూ రామాలయం ముందు వరద నీటితో సగం వరకు మునిగింది. కొందరు కాలనీవాసులు శనివారం ఆలయం ఎదుట నిల్వ ఉన్న వరదలో జలకాలాడుతు ఆనందించారు.

ఈవ్ టీజింగ్‌పై అవగాహన


పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం షీటీం ఆధ్వర్యంలో ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. షీ టీం సబ్ డివిజన్ కానిస్టేబుళ్లు విఘ్నేశ్, సుమతి మాట్లాడుతూ.. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎస్సై అప్పారావు, హెడ్ కానిస్టేబుల్ వినంత్రావు, హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయులు అశ్ఫాక్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు



వర్ని: భారీ వర్షాల మూలంగా దెబ్బతిన్న రోడ్లకు సత్వరమే మరమ్మత్తులు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పోచారం భాస్కర్ రెడ్డి వెల్లడించారు. శనివారం వర్ని మండలం చింతల్ పేట్ తండా రోడ్డు, సిద్దాపూర్ రిజర్వాయర్ ఆనకట్ట, వర్ని జలాల్పూర్ రహదారి, పులి క్యాంపు లో వరద నీరు నిలిచిన ఇళ్లను భాస్కర్ రెడ్డి స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేశ్ బాబా, మాజీ జెడ్పీటీసీలు హరిదాసు, రణజా నాయక్, మార్కెట్ కమి టీ మాజీ ఉపాధ్యక్షుడు గోపాల్, జాకోరా సొసైటీ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీహెచ్ గంగాధర్ పాల్గొన్నారు.

వరద ప్రాంతాల పరిశీలన



మోర్తాడ్: ఏర్గట్ల మండలంలోని దోంచంద, గుమ్మిర్యాల్, తడపాకల్‌లలో వరదల వల్ల నష్టపోయిన పంటలను, గోదావరి నది ప్రవాహాన్ని శనివారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌రెడ్డి పరిశీలించారు. పంటల నష్టంను అధికారులు అంచనా వేస్తున్నారని ప్రభుత్వం పరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రైతన్నకు తీరని నష్టం

బోధన్: మంజీర నది పరీవాహక ప్రాంత రైతులను భారీ వర్షం, వరదలు అపార నష్టానికి గురి చేశాయి. సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్, సాలూర, తగ్గెల్లి గ్రామాల శివారులోని వేలాది ఎకరాల్లో సోయా, వరి పంటలతో పాటు బొప్పాయి, డ్రాగన్, కూరగాయలు వేసిన పొలాలు రెండు రోజులుగా వరద నీటిలోనే ఉన్నాయి.



సాలూర శివారులో వరద నీటికి మునిగిన డ్రాగన్ ఫ్రూట్ తోట



సాలూర మండలం హున్సా శివారులో నీట మునిగిన సోయా పంట



సాలూర మండల శివారులో వరద నీటిలో మునిగిన సోయా, వరి పంట

ఓటరు జాబితాపై అభ్యంతరాలు నమోదు



డొంకేశ్వర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో బుక్య లింగం

డొంకేశ్వర్: మండలంలో అన్ని జీపీల్లో ఈ నెల 28న ప్రచురించిన ఓటర్ల ముసాయిదాపై అభ్యంతరాలు నమోదయ్యాయి. మండల వ్యాప్తంగా మొత్తం 56 అభ్యంతరాలు వచ్చాయి. శనివారం మండల కేంద్రంలో ఎంపీడీవో బుక్య లింగం ఆధ్వర్యంలో రాజకీయల పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యంతరాలను స్వీకరించారు. మండలంలో 13 జీపీలు ఉండగా పదమూడు లొకేషన్ల పరిధిలో 118 పోలింగ్ కేంద్రాలున్నాయని ఎంపీడీవో తెలిపారు. మొత్తం 16,760 ఓటర్లు ఉండగా 7,696మంది పురుషులు, 9,064 మంది మహిళలు ఉన్నారన్నారు. సెప్టెంబర్ 2న తుది జాబితా ప్రదర్శిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు గొడిసెరం భూమేశ్‌రెడ్డి, మగ్గిడి చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

నామినేషన్ కేంద్రాలు ఖరారు

సర్పంచ్ ఎన్నికలు వస్తే నామినేషన్లు దాఖలు చేయడానికి కేంద్రాలను ఖరారు చేశారు. అన్నారం, సిర్పూర్, నికాల్‌పూర్, కోమట్‌పల్లి గ్రామాలకు డొంకేశ్వర్ జీపీలో అలాగే మారంపల్లి, తొండాకూర్ గ్రామాలకు దత్తాపూర్ జీపీలో అదే విధంగా చిన్నయానం, గాదేపల్లి, జీజీ నడ్కుడ, గంగాసముందర్ గ్రామాలకు నూత్‌పల్లి జీపీలో నామినేషన్లు వేయాల్సి ఉంటుంది.

మెండోరాలో..



మెండోరాలో.. మండల ప్రత్యేకాధికారి ఆంజనేయులు

బాల్కొండ: స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలపాలని మెండోరా మండల ప్రత్యేకాధికారి ఆంజనేయులు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల తుది జాబితాను అన్ని జీపీ కార్యాలయాల్లో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా బాల్కొండ, ముప్కాల్ మండల పరిషత్ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించారు.

ఆర్మూర్‌లో..



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో శివాజీ

పెర్కిట్: ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలంయలో శనివారం ఎంపీడీవో శివాజి పలు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆర్మూర్ మండలంలోని 14 గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను అధికారులు సిద్ధం చేశారు. జాబితాపై అభ్యంతరాలు, సూచలు తెలియజేయడానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీవో శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, ఈ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

నందిపేట్‌లో..



నందిపేట్‌లో మాట్లాడుతున్న అధికారులు

నందిపేట్: మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో అధికారులు ఓటరు జాబితాలో అభ్యంతరాలపై సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఓటరు లిస్టుల్లో వచ్చిన తప్పులను రాజకీయ పార్టీల నాయకులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. జాబితాలో ఉన్న తప్పులను సరిచేస్తామని ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ సతీశ్ తెలిపారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బ్రహ్మానందం, ఎంపీవో శ్రీనివాస్ ఆయా పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు రవికుమార్, వెంకటేశ్వర్‌రావు, గంగోనే సంతోష్, మదారి రాజు, కోకా హైమద్ పాల్గొన్నారు.

బోధన్‌లో..



సాలూరలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

బోధన్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సాలూర మండల పరిషత్ ఆఫీస్‌లో జీపీల వార్డుల వారీగా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితా పై సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల పై ఎలాంటి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో తెప్పను వదిలిన గ్రామస్తులు



గోదావరి నదిలో తెప్పను వదులుతున్న గ్రామస్తులు

రెంజల్: గోదారమ్మ శాంతించి పంటలను, ప్రజలను కాపాడాలని కోరుతూ గ్రామస్తులు పూజలు నిర్వహించి తెప్పను గోదావరిలో వదిలారు. మూడు రోజులుగా గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో మండలంలోని తాడ్‌బిలోలి–బోర్గాం గ్రామాల మధ్య ఎన్‌హెచ్ 161బీబీ పై రాకపోకలు నిలిచిపోయాయి. దీనికి తోడు వందలాది ఎకరాల పంటలు ముంపునకు గురయ్యాయి. దీంతో తాడ్‌బిలోలి గ్రామస్తులు శనివారం గ్రామంలోని రేవు వరకు పాదయాత్రగా చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి నదిలో తెప్పను వదిలారు.

కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ కార్కన శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నర్సయ్య, గ్రామాభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అబ్బయ్య, గ్రామపెద్దలు యోగేశ్ పటేల్, జగన్‌రెడ్డి, సాయారెడ్డి, మల్ల సాయిలు, గంగాధర్, లక్ష్మణ్, దత్తుపటేల్, శ్రీనుపంతులు, లింగాల సాయిలు, రమేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించాలి

బోధన్: ప్రతి పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పురోగతి పై ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని బోధన్ ఎంఈవో నాగయ్య హెచ్ఎంలకు సూచించారు. శనివారం పట్టణ కేంద్రంలోని డివిజన్ విద్యాశాఖ అధికారి కార్యాలయం మీటింగ్ హాల్‌లో మండల స్థాయి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో పాఠశాల నిర్వహణ, విద్యా బోధన అంశాల పై సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి హాజరును ఫేషియల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

కార్యక్రమంలో కాంప్లెక్స్ స్కూల్ హెచ్ఎంలు ఆరిఫ్ ఉద్దీన్, గెజిటెడ్ హెచ్ఎం ఆదినారాయణ, అన్నాగ్రేస్, భూమయ్య, సీఆర్పీలు విజయ్, రేఖ, విజయ, యూసుఫ్, బాబు, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో నాగయ్య

పంటలకు పరిహారం చెల్లించాలి

మోర్తాడ్/ రుద్రూర్: భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఏర్గట్ల మండలంలోని దోంచందలో వరదల వల్ల నీట మునిగిన పంటలను ఆయన పరిశీలించారు. కురిసిన వర్షాలకు పంట నీట మునిగి దెబ్బతిన్నదని, దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నూర్జహాన్ డిమాండ్ చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలో వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కోటగిరి మండల కేంద్రంలో వర్షానికి కూలిన ఇళ్లను బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు



వర్నిలో అన్నదానం చేస్తున్న సభ్యులు

వర్ని/ నవీపేట/ ఆర్మూర్‌టౌన్/ రుద్రూర్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాలోని గణేశ్ మండపాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వర్ని మండల కేంద్రంలోని స్కంద పూర్వజ వినాయక మండపం, నవీపేట మండల కేంద్రంలోని ధర్యాపూర్ వీరాంజనేయ గణేశ్ మండలి, ఆర్మూర్ పట్టణంలోని రైడర్స్ యూత్, ముదిరాజ్ సంఘం వారు అన్నదానం నిర్వహించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని సార్వజనిక్ గణేష్ మండలి వారు పూజలు చేశారు.



నవీపేటలో..

కొనసాగుతున్న వ్యవసాయ శాఖ సర్వే

- కొలిక్కిరాని పంట నష్టం అంచనా

రుద్రూర్: వరద బీభత్సానికి పంటలు నీట మునిగాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. పాత ఇళ్లు కుప్ప కులాయి. మూడు రోజులుగా చినుకు వస్తుందంటే గజగజ వణికి పోయేస్థితికి ప్రజలు చేరుకున్నారు. పొతంగల్ మండలంలోని మంజీరా నది సమీపంలోని గ్రామాల్లో ప్రజలకు కంటి మీద కునుకు రాకుండా పోయింది. వేల ఎకరాల్లో పంట పొలాలు వరద నీటితో నిండిపోయాయి. 2,400 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వరి 1620 ఎకరాల్లో, సోయా 779 ఎకరాల్లో నీట మునిగింది. ఇంకా మంజీరా తీర ప్రాంతాల్లోని గ్రామాల్లో అధికారులు సర్వే చేస్తూనే ఉన్నారు. శనివారం కల్లూర్, పొతంగల్ శివారులో ఏఈవోలు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వరద ఉధృతి తగ్గగానే పొలాల్లో నిలిచిన నీరు వెనక్కి పోతోంది. కానీ వరదతో పాటు వచ్చిన ఇసుక పొలాల్లో తిష్ట వేసింది.



కొడిచర్ల పొలంలో వరదతో వచ్చిన ఇసుక దిబ్బను చూపుతున్న రైతు

నాలుగెకరాల పంట నీళ్లలో ఉంది



కొడిచర్ల శివారులో పదెకరాలు కౌలు చేస్తున్నా. రూ. లక్షలు పెట్టుబడి పెట్టి సేద్యం చేస్తున్న. ఒక్కసారిగా వచ్చిన వరద నాలుగేకరాల పొలంలో నిండిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి. – సూదం సాయిలు, రైతు పొతంగల్

ఇసుక దిబ్బలు వచ్చాయి

సాగర్ గేట్లు తెరవడంతో మంజీరా పొలాల్లో నుంచి ప్రవహించింది. ఐదెకరాలు కౌలు చేస్తున్నా. నాలుగెకరాల్లో నీళ్లు ఉన్నాయి. ఇప్పటికే రూ. లక్షా 50 వేలు ఖర్చు చేసినా.. పంట పొట్టకు వచ్చే సమయంలో నీటిలో మునిగిపోయింది.

– కోటగిరి హన్మంతు, రైతు, కొడిచర్ల

సంక్షిప్తం

మటన్ మార్కెట్‌ను వేరే ప్రాంతానికి తరలించాలి



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మటన్ మార్కెట్‌ను వేరే చోటికి తరలించాలని కాలనీ వాసులు జీపీ కార్యదర్శి గంగాజమునకు శనివారం వినతిపత్రం అందజేశారు. మార్కెట్‌లో విక్రయదారులు జీవాలను కోసి వ్యర్థాలను అక్కడే వదిలేస్తుండడంతో దుర్వాసన వస్తోందని అన్నారు. మాంసం వ్యర్థాలతో కుక్కల బెడద ఎక్కువైందన్నారు. కాలనీ వాసులు గాండ్ల శ్రీనివాస్, కొంటికంటి నరేందర్, బాలయ్య, సుధాకర్, గంగారాం, గంగాధర్, సురేశ్, కృష్ణమూర్తి, అనిల్‌కుమార్, వసంత్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

ఆర్మూర్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామని సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. మామిడిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే నిర్వహించారు. అనంతరం చిన్నారుల తల్లులకు, ఆటపాటలకు సంబంధించిన వాటిని ప్రదర్శించి, విద్యా, పౌష్టికహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంగీత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి



ఆర్మూర్‌టౌన్: జీపీ కార్మికుల వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలగాణ జీపీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం సెప్టెంబర్ 7న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సు గోడప త్రులను ఆవిష్కరించారు. కార్యాక్రమంలో నాయకులు జీపీ గంగాధర్, అబ్దుల్, పోశెట్టి, సొప్పరి గంగాధర్, పల్నాటి సాయిలు, లక్ష్మణ్, చిన్న గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మాక్ ఎలక్షన్

నందిపేట్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పాఠశాల స్థాయి నుంచి పెంచుకోవాలని తహసీల్దార్ సతీశ్, ఎంఈవో గంగాధర్ సూచించారు. మండల కేంద్రంలోని ఉజ్వల పాఠశాల విద్యార్థులకు శనివారం స్కూల్ కౌన్సిల్ మెంబర్ల నియామకంపై మాక్ ఎలక్షన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అరుణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధన్‌లో వీధి కుక్కలకు స్టెరిలైజేషన్

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలో శనివారం నిజామాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేశారు. వారం రోజుల క్రితం పట్టణ పరిధిలోని గోషాల రోడ్డులో వీధి కుక్క ఐదుగురిపై దాడిచేసి గాయపరిచిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు పట్టణ పరిధిలో 125 వీధి కుక్కలను పట్టుకొని స్టెరిలైజేషన్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు.

ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం



మాక్లూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రకాశ్, సొసైటీ చైర్మన్ బూరోల్ల అశోక్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మండల మైనార్టీ నాయకుడు జాఫర్, నాయకులు పాల్గొన్నారు.



సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.